ముగిసిన దసరా ఉత్సవాలు

కోడుమూరు రూరల్ : దేవీశరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఈనెల 15నుంచి 23వతేదీ వరకు తొమ్మిదిరోజులపాటు సాగిన ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా కోడుమూరులోని శ్రీవల్లెలాంబదేవి, శ్రీకాళికామాతా, శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీరాములవారి దేవాలయం, శ్రీరాములమ్మ, శ్రీచౌడేశ్వరీదేవి, శ్రీగంగమ్మ, శ్రీతులజాభవాని, శ్రీఅంబా భవాని ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం రాత్రి శ్రీవల్లెలాంబదేవి, శ్రీకాళికామాతా, శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీరాములవారి దేవాలయం, శ్రీరాములమ్మ ఆలయాల నుంచి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య పట్టణ వీధుల గుండా అంగరంగవైభవంగా ఊరేగించారు. ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ప్రత్యేకించి ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు నవధాన్యాల మొలకలను మోస్తూ నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శ్రీకాళికాదేవి, శ్రీవల్లెలాంబదేవి, ఎస్‌ఎస్‌కె సమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు: దసరా ఉత్సవాలు ఘనంగా పట్టణంలో ముగిశాయి. 9 రోజుల పాటు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు నవధాన్యాలను బోణకుండలపై ఉంచుకుని ఊరేగింపు నిర్వహించి బావిలో నిమజ్జనం చేశారు.

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాలలో సోమ, మంగళవారాలలో ప్రజలు దసరా ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో దసరా పండుగ సందర్భంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. సి.బెళగల్‌లోని పడమటి ఆంజనేయస్వామి, ఈశ్వరాలయంలోని దుర్గాదేవి, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలోని అమ్మవారిని, శ్రీ రంగనాథుడి ఆలయంలోని స్వామి వార్లకు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో చిన్నారు లు హారతి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


సి.బెళగల్‌లో అమ్మవారి గ్రామోత్సవంలో హారతులతో పాల్గొన్న చిన్నారులు


నిమజ్జనానికి తరలివెళ్తున్న అమ్మవారు

గడివేముల: దసరా ఉత్సవాలు ముగిశాయి. దసరా పర్వదినం సోమవారం శ్రీదుర్గాభోగేశ్వర, మూల పెద్దమ్మ, గని బృందావనం, బాలాజీ టెంపుల్ తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గడిగరేవుల గ్రామంలో చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకించి కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


వివిధ వేషధారణలో కళాకారులు

పాణ్యం: దసరా ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. మండల కేంద్రం పాణ్యంలోని శ్రీ వాసవీ కాన్యకపరమేశ్వరి ఆలయం నుంచి అమ్మవారిని పురవీధుల గుండా ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య అమ్మవారికి ఊరేగింపు వైభవంగా సాగింది. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను హైవ వద్ద ఉన్న జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. అదేవిధంగా పెద్దమ్మ గుడి వద్ద హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాకారులు విషేధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి విగ్రహాల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


కోడుమూరులో మొలకలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు


సి.బెళగల్‌లో శ్రీరంగనాథస్వామి పల్లకోత్సవంలో భక్తులు


గడివేముల మూల పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దూదేకుల సింహగర్జనను విజయవంతం చేయండి

గడివేముల: గుంటూరులోని ఆంధ్రముస్లిం కాలేజీలో ఈ నెల 29న నిర్వహించే దూదేకుల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జమాల్‌బాషా, కరిమద్దెల మాజీ సర్పంచ్ డాలుస్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని పెసరవాయి, కరిమద్దెల, మంచాలకట్ట, గడివేముల గ్రామాల్లో దూదేకుల సోదరలను కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటికీ దూదేకుల సామాజిక వర్గాలు అన్నిరంగాల్లో వెనుకపడి ఉన్నారని, హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు యాసిన్‌బాషా, ఎక్స్‌ఆర్మీ జమాల్, సోపిసాహేబ్, జమాల్, చాంద్‌బాషా, రఫీ తదితరులు పాల్గొన్నారు.


గడివేములలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న దూదేకుల సంఘం సభ్యులు

బ్రాహ్మణపల్లె సర్పంచ్ భర్త మృతి

ఓర్వకల్లు: మండలంలోని బ్రాహ్మణపల్లె సర్పంచ్ సేగిరెడ్డి జయభారతమ్మ భర్త సేగిరెడ్డి భూషిరెడ్డి (80) మంగళవారం మృతి చెందాడు. పది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక మృతి చెందాడు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉదయం గ్రామానికి చేరుకొని భూషిరెడ్డి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రవికుమార్, బలరాముడు, నాగేశ్వరరెడ్డి, దేవరాజు, కానుగల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నేడు దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవం


నిమజ్జనం జరిగే దుర్గా ఘాట్

- సంకల్‌బాగ్ దుర్గా ఘాట్‌లో ఏర్పాట్లు
- పూజల అనంతరం ప్రారంభం కానున్న శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవ వేడుక బుధవారం సంకల్ బాగ్ తుంగభద్ర నది తీరంలోని దుర్గాఘాట్‌లో జరగనుంది. టీజీవీ కళాక్షేత్రం, గీతా ప్రచార సమితి, దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్స సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 120 విగ్రహాలు శోభాయాత్రగా దుర్గా ఘాట్‌కు చేరుకోనున్నాయి. మహిళలు బోనాలు, కలశాలతో యాత్రలో పాల్గొననున్నారు. అతిథులు గంగమ్మకు పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభించనున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సాయంత్రం జరిగే నిమజ్జనానికి ప్రధాన వేదిక, క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫ్లడ్‌లైట్లు, రంగు రంగుల విద్యుత్ దీపాలు, సాంస్కృతిక ప్రదర్శనల వేదిక, స్వాగత ద్వారాలను సిద్ధం చేశారు. నిమజ్జనానికి సంబంధించి మంగళవారం మౌర్యా ఇన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది దుర్గా ఘాట్‌లో నిమజ్జనం జరుగుతుందన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనోత్సవం విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. కమిటీ సభ్యులు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, చల్లా దామోదర్‌రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, బ్రాహ్మణ సంఘం కర్నూలు నగర అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, మహేష్, మహాబలేష్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.


కుమ్మరి వీధిలో కొలువు దీరిన దుర్గమ్మ


స్వాగత తోరణాలు


ప్రధాన వేదిక

గుర్రాల పారువేట అదుర్స్

మద్దికెర: విజయదశమి పండుగ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన గుర్రాల పారువేట అశేష జనవాహిని మధ్య కనులపండువగా సాగింది. పారువేటలో వేమనగిరి యాదవరాజులు జగదీల్‌రాయుడు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దనగిరి, చిన్న నగిరి, వేమనగిరి కుటుంబాలకు చెందిన యాదవ వంశీకులు రాజదుస్తులతో ఠీవిగా గుర్రాలపై కూర్చోగా, వారి వెంట ఆయుధాలు ధరించిన సైనికులు ఊరేగింపుగా గ్రామ సరిహద్దులోని రాగిమాను కట్ట వద్దకు వచ్చారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో బొజ్జనాయుని పేట గ్రామంలో వున్న భోగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన గుర్రాల పారువేటలో వేమనగిరి కుటుంబానికి చెందిన వారు ముందుగా మద్దికెరకు చేరుకొని విజయం సాధించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిలో అశేష జనవాహిని మధ్య విజయం సాధించిన అశ్వాన్ని ఊరేగించారు. పెద్ద ఎత్తున ప్రజలు, యాదవరాజ వంశీకులు రాజన్నయాదవ్, నీలకంఠరాయుడు, జయరామరాజు, ఈశ్వర రాయుడు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రిజ్వాన్ మహమ్మద్ బందోబస్తు నిర్వహించారు.


విజయం సాధించిన అశ్వంపై వేమనగరి కుటుంబీకులు

బుడగ జంగాల సమస్య పరిష్కారానికి కృషి

- ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్

కర్నూలు(అర్బన్): దశాబ్దాలుగా బుడగ జంగాల జాతి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నేతలు ఎంపీని కలిసి తమ జాతికి న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ మాట్లాడుతూ తమ జాతికి ఇచ్చిన హామీ మేరకు షెడ్యూల్ కులాల్లో తాము కోల్పోయిన హక్కులను అమలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ, క్యాబినేట్‌లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారన్నారు. ఈ నివేదికపై పార్లమెంట్‌లో ప్రస్తావించి, తమ జీవన స్థితిగతులను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు తెలియజేసి న్యాయం చేయాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు కొండపల్లి, గోకారి, కళ్యాణ మారెప్ప, సిరువాటి రంగస్వామి, బైల్పాటి మద్దిలేటి, పెద్ద చింతలయ్య తదితరులు ఉన్నారు.


ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగాల నేతలు

కొర్రపోలూరు రోడ్డుకు మోక్షం



నాడు : గుంతలమయంగా గడివేముల-కొర్రపోలూరు రోడ్డు (ఫైల్)


నేడు : తారురోడ్డు వేయడంతో మెరుస్తున్న గడివేముల-కొర్రపోలూరు రహదారి

- రూ. 23 లక్షలతో రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే కాటసాని చొరువతో తీరిన రహదారి సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గడివేముల: మౌలిక వసతుల కల్పనకు వైస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. ప్రత్యేకించి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పొలాల రహదారుల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ చర్యలు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరువతో కొర్రపాలూరు రోడ్డుకు మోక్షం లభించింది. మండల కేంద్రం గడివేము సమీపానున్న కొర్రపోలూరు రోడ్డు అస్తవ్యస్థంగా ఉండేది. గడివేముల–వెలుగోడు రహదారిలో ఉన్న కొర్రపోలూరు గ్రామం వరకు రోడ్డు గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. మండల కేంద్రం నుంచి కేవలం మూడు కిలోమీటర్లు ఉన్న కొర్రపోలూరుకు వెళ్లాలంటే నరకం కనిపించేది. బాటసారులు, వాహనచోదకులు ఈ రోడ్డులో వెళ్లాంటే భయపడే పరిస్థితి. ఇక వర్షాకాలం తిప్పులు వర్ణనాతీతం. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డు సమస్యను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కాటసాని జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.23 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు నిర్మించిన తారురోడ్డు మెరుస్తుంది. దీంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ప్రభుత్వంతో పాటు ఎమ్మెల్యే కాటసానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇప్పుడు రోడ్డు బాగా ఉంది



గడివేముల నుంచి కొర్రపాలూరు మా గ్రామానికి వెళ్లటంటే చాలా ఇబ్బందులు పడేవారం. కేవలం మూడు కిలోమీటర్ల ప్రయాణించాలంటే 30 నిమిషాలు పట్టేది. గత ప్రభుత్వాలు ఈ రోడ్డు సమస్యను పట్టించుకోలేదు. అధ్వాన్నంగా రోడ్డు పరిస్థితిని ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పుడు ప్రయాణం సులువైంది. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు. –సుబ్బారెడ్డి, కొర్రపాలూరు

చాలా ఇబ్బందులు పడ్డాం



మా ఊరి రోడ్డు అడుగుకో గుంత ఉండేది. రాకపోకలకు చాలా ఇబ్బందులు పడ్డాం. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. గతంలో పలుమార్లు రోడ్డు సమస్యను అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతోనే రోడ్డు సమస్య తీరింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – నీలగిరి నారాయణ, కొర్రపాలూరు

క్లుప్తంగా

నేటి నుంచి జోహరాపురం ఉరుసు


సయ్యద్ అల్లాబకాష్ వలి దర్గా

కర్నూలు(అర్బన్): నగర పరిధిలోని జోహరాపురంలో ఈ నెల 25 నుంచి 27వ తేది వరకు సయ్యద్ అల్లాబకాష్ వలి ఉరుసు నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు సయ్యద్ అల్లాఉద్దీన్ షరీఫ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25వ తేదీన గంధం, 26వ తేదీన ఉరుసు (తట్టీలు), 27వ తేదీన కిస్తీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉరుసు ఉత్సవాల్లో గ్రామంలోని హిందు, ముస్లిం, క్రైస్తవులందరు ఐకమత్యంతో మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకుంటారన్నారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక, పక్కనున్న తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు.

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు

కర్నూలు : నగరంలో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపి వాటిని అదుపు చేయలేక ప్రమాదానికి గురవుతున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు కొంతకాలంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు ఆలోచించాలని మంగళవారం విడుదల చేసిన వీడియో మెసేజ్‌లో ఎమ్మెల్యే సూచించారు. మైనర్ డ్రైవింగ్‌లో తొలిసారి పట్టుబడిన వారికి అధిక ఫైన్లు వేయకుండా మొదట కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

కల్లూరు: దసరా పండుగను పురస్కరించుకుని 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, ప్రగతి రూరల్, ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ మమతారెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రగతి సొసైటీ సమాజంలో చేసే సేవా కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, దేవదాసు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్లపరిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను బుధవారం మండలంలోని కల్లపరి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. వైద్యనిపుణులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలతోపాటు మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు మంగళవారం డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 0.581 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయినట్లు చెప్పారు.

28 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు : రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయించిన వెల్ఫేర్ స్టాంపు రూ.20కు వ్యతిరేకంగా ఈనెల 28 వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగభూషణం నాయుడు, ఎం.వి.చక్రపాణి తెలిపారు. న్యాయవాదులందరూ సహకరించి ఆందోళనను విజయవంతం చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆయుధ పూజ

కర్నూలు(సెంట్రల్): ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు రైల్వే గూడ్సు షెడ్డులో రైల్వే కాటాకు పూజలు జరిపారు. ఈ పూజ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని కర్నూలు–గుంటూరు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు రూరల్ ఏఈ ఆంజనేయశాస్త్రి మంగళవార ఓ ప్రకటనలో తెలిపారు. కాలేజ్, అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలోని నందనపల్లె, సుదిరెడ్డి పల్లి, వెంకాయపల్లి పరిధిలోని వెంచర్లు, జి.పుల్లయ్య కాలేజీ ఏరియాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఇలా..

అగ్రికల్చర్ ఫీడర్‌కు సంబంధించి బుధవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

31న మండల మీట్

పాణ్యం: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా మండల మీట్‌కు హాజరు కావాలన్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని చెరవుకట్ట వద్ద మంగళవారం సాయంత్రం ఎదురెదరుగా బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన రాంచంద్రుడు, మరో బాలికలకు గాయాలైనట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం నంద్యాలకు తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించినట్లు తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

గడివేముల: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దుర్వేసి గ్రామానికి చెందిన ద్వారం రామిరెడ్డికి (41) 17 ఏళ్ల కిందట వివాహమైంది. సంతానం కలగకపోవడంతో మానసికంగా బాధపడేవాడు. ఈనెల 22వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందును తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కోలకోలేక మృతి చెందాడు. భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రోటా వేటర్ కిందపడి బాలుడి మృతి

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో రోటావేటర్ కిందపడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు షేక్ వాహిద్ అలియాస్ షమివుల్లా (14) మండల కేంద్రం గడివేములలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో తన స్నేహితుడు పొలాలంలో జరుగుతున్న రోటావేటర్ పనులు చూసేందుకు సరదాగా వెళ్లాడు. ట్రాక్టర్‌తో పొలం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రోటావేటర్‌లో పడిపోయాడు. దీంతో బాలుడి శరీరం ముక్కలు ముక్కలైంది. స్థానిక పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

రేపు 'శ్రీకృష్ణ - తులాభారం' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో 'శ్రీకృష్ణ – తులాభారము' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారులు కోటేశ్వరరావు, గణేష్‌కుమార్, విజయదుర్గ, రత్నశ్రీలు ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు తెలిపారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.